క్లుప్తంగా

చదువుతో జ్ఞానం వృద్ధి



కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

మల్కాపురం: చదువు కోవడం వల్ల విజ్ఞానంతో పాటు వికాసం లభిస్తుందని మల్కాపురం శాఖా గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ అన్నారు. చదువు మాకు ఇష్టం అనే కార్యక్రమాన్ని ఆదివారం శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొని చదువు వల్ల కలిగే ప్రయోజనం, ఏ చదువు దేనికి ఉపయోగం,ఉన్నత శిఖరాల్లో నిలవాలంటే ఎలాంటి విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలో వివరించారు. గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ గ్రంథాలయాల్లో లభించే పుస్తక సంపద వల్ల ఎంత విజ్ఞానం పొందవచ్చో వివరించారు.

చిత్రకారుడికి సత్కారం



చిత్రకారుడు రవి కిశోర్‌ను సత్కరిస్తున్న చిత్రకళా పరిషత్ ప్రతినిధులు

మల్కాపురం: ప్రముఖ చిత్రకారుడు పి.రవి కిషోర్‌ను చిత్రకళాపరిషత్ ప్రతినిధులు ఆదివారం ఘనంగా సత్కరించారు. స్థానిక హిమాచల్‌నగర్ వద్ద జరిగిన కార్యక్రమంలో చిత్రకళా పరిషత్ ప్రతినిధి జి.కె.వి.రాజు తదితరులు రవి కిషోర్‌కు శాలువా కప్పి జ్ఞాపిక అందించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ మాట్లాడుతూ రవి కిషోర్ గీసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉంటాయని అభినందించారు. కార్యక్రమంలో చిత్రకళా పరిషత్ ప్రధాన కార్యదర్శి సుంకర చలపతిరావు, చిత్రకారుడు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కాపులు ఐక్యంగా ఉంటే సమాజంలో గుర్తింపు



ఐక్యతను చాటుకుంటున్న నాయకులు

అగనంపూడి: కాపులు ఐకమత్యంతో ఉంటే సమాజంలో ఉన్నత పదవులతోపాటు రాష్ట్రంలో తగిన గుర్తింపు ఉంటుందని కృష్ణదేవరాయ గాజువాక కాపు సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు జెర్రిపోతుల ముత్యాలు అన్నారు. అగనంపూడి బొర్రమాంబ ఆలయం వద్ద అగనంపూడి కాపు సేవా సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపులు అత్యధికంగా ఉన్న గాజువాకలో మరింత ప్రాధాన్యం కల్పించాలన్నారు. జిల్లాలోని కాపులను ఒకేతాటిపైకి తీసుకువచ్చేందుకు వచ్చేనెల 24వ తేదీన కాపు వన సమారాధన ఏర్పాటు చేశామని, జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి తలారి వెంకటరమణ, ముమ్మన అప్పారావు, కటారి శ్రీనివాసరావు, గంతకోరు అప్పారావు, దుల్లా చెల్లారావు, ఈ.హనుమంతురావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహుడికి ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఉదయం 7గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ప్రారంభించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి కుటుంబ సమేతంగా పూజలో పాల్గొన్నారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం

రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని



గోపాలపట్నంలో నూతనంగా నిర్మించిన ఆస్పత్రి భవనం



కొత్తపాలెం ఆస్పత్రిలో ఒక గదిని ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున



గోపాలపట్నం ఆస్పత్రిలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజని

గోపాలపట్నం : మెరుగైన వైద్యాన్ని ప్రజలకు చేరువ చేశామని ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని అన్నారు. గోపాలపట్నం 30 పడకల ఆస్పత్రి అదనపు భవనాన్ని, కొత్తపాలెంలోని యల్లపువానిపాలెం-2 నూతన వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం సాయంత్రం ఆమె ప్రారంభించారు. అక్కడి వసతులు, వైద్యం అందించే విధానాలను పరిశీలించారు. తొలుత గోపాలపట్నం ఆస్పత్రిని ప్రారంభించి వైద్యుల గదులు, ఓపీ విభాగం, ఎమర్జెన్సీ గదులు, రోగులు వేచి ఉండే గదులను పరిశీలించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలు గదులను కలెక్టర్ మల్లికార్జున, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ చైర్మన్ ఆదారి ఆనంద్‌కుమార్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ పరిశీలకుడు ఎస్ఏ రెహమాన్, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ప్రారంభించారు. అనంతరం కొత్తపాలెంలో యల్లపువానిపాలెం-2 యూపీహెచ్‌సీని ఆమె ప్రారంభించారు.

వైద్య రంగానికి సీఎం జగన్ చేయూత..

వైద్య రంగానికి సీఎం జగన్ చక్కటి చేయూత అందజేస్తున్నారని మంత్రి రజని అన్నారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో చంద్రనగర్ యూపీహెచ్‌సీని రూ. 1.26 కోట్లతో నిర్మించామన్నారు. గోపాలపట్నంలో ఉన్న సీహెచ్‌సీని నాడు-నేడు పథకం ద్వారా అప్‌గ్రేడ్ చేస్తూ రూ.5.50 కోట్లతో నూతన భవనాలు నిర్మించామన్నారు. అలాగే కప్పరాడలో రూ. 1.24 కోట్ల వ్యయంతో నూతన యూపీహెచ్‌సీ నిర్మించామన్నారు. వైద్య ఆరోగ్య రంగంలో రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న చర్యలు అమోఘమన్నారు. యూపీహెచ్‌సీల ద్వారా ఆయా ప్రాంతాల్లో ఉండే సుమారు 25 వేల నుంచి 30 వేల వరకు ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందుతుందన్నారు. సీహెచ్‌సీల పరిధిలో సుమారు 2 లక్షల మందికి వైద్య సేవలు అందించే అవకాశముందన్నారు. నాడు-నేడు కింద ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూ. 17 వేల కోట్లు ఖర్చు చేస్తూ రాష్ట్రంలో ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా పేదలకు ప్రభుత్వ వైద్యం చేరువ చేశామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎలాంటి సత్ఫలితాలను ఇస్తుందో రాష్ట్ర ప్రజలంతా చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం అయిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్ డాక్టర్ దొర, సీఎంహెచ్‌వో జోన్-8 కమిషనర్ మల్లయ్యనాయుడు, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, అయితంశెట్టి గోపాలకృష్ణ, నమ్మి వెంకటకృష్ణమూర్తి, యాదవ, స్థానిక నాయకులు, మాజీ కార్పొరేటర్ అయితంశెట్టి కోటేశ్వరరావు, పలు వార్డుల కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్‌లో భారీ చోరీ



ఇంట్లో చిందర వందరగా పడి ఉన్న వస్తువులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని క్వార్టర్స్‌లో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్ విభాగంలో సీనియర్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం. శ్రీనివాస్ టౌన్‌షిప్ సెక్టార్-1లోని 149-డీ క్వార్టర్‌లో కుటుంబంతో నివశిస్తున్నారు. యథావిధిగా శనివారం రాత్రి తలుపులు వేసిపడుకున్నారు. తెల్లవారి లేచి చూడగా ఇంటి హాల్లో వస్తువులు చిందర వందరగా పడిఉన్నాయి. ప్రధాన ద్వారం ముందు వైపు గడియ పెట్టి ఉంది. తనిఖీ చేయగా ఇంట్లో ఉండాల్సిన సుమారు 10 నుంచి 12 తులాల బంగారం వస్తువులు, 10 తులాల వెండి వస్తువులు, రెండు మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్ మాయమయ్యాయి. దీంతో వారు స్టీల్‌ప్లాంట్ పోలీసులకు సమాచారం అందించారు. క్రైం ఎస్ఐ ఎల్. శ్రీనివాసరావు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. క్లూస్ టీంకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి వేలిముద్రలు సేకరించారు. దొంగలు దిగువున ఉన్న పైపును పట్టుకుని పైఅంతస్తుకు వచ్చి వెనుక ద్వారం గుండాలోనికి ప్రవేశించినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఉద్యోగి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ప్రకాష్‌నగర్‌లో కార్పొరేటర్ విస్తృత పర్యటన



ప్రకాష్‌నగర్‌లో మహిళల సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్‌లో ఆదివారం వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్ల లక్ష్మణరావు విస్తృతంగా పర్యటించారు. స్థానిక ప్రజలు తమ ప్రాంతంలో మంచినీటి సరఫరా సరిగ్గా జరగడం లేదని, మంచినీరు కూడా సరిపడా సరఫరా చేయడం లేదని ఫిర్యాదు చేయడంతో ఆదివారం సంబంధిత విభాగ అధికారులతో పర్యటించారు. సమస్యను నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆదారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వాటర్ సప్లై ఏఈ కనకరాజు, వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్, నాయకులు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్టీఎల్‌లో ముగిసిన నిఘా వారోత్సవాలు



ప్రొఫెసర్ సత్యనారాయణకు జ్ఞాపిక అందిస్తున్న ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్

గోపాలపట్నం: దేశానికి కట్టుబడి - అవినీతికి నో చెప్పండి అనే అంశంతో ఎన్ఎస్టీఎల్‌లో నిర్వహించిన విజిలెన్స్ అవేర్‌నెస్ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఇక్కడి మహాపాత్ర మాని ఆడిటోరియంలో సెమినార్ నిర్వహించారు. దామోదర్ సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వై. సత్యనారాయణ అవినీతికి పాల్పడితే ఏ విధమైన దుష్పరిణామాలు ఏర్పడతాయో వివరించారు. అవినీతిని రూపుమాపడానికి అవలంబించాల్సిన అంశాలను ఉద్యోగులు వివరించారు. వారం రోజుల కార్యక్రమాల్లో భాగంగా ఎన్ఎస్టీఎల్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు. పలు పాఠశాలల విద్యార్థులకు అవినీతి నిరోధంపై అవగాన కల్పించారు. ముగింపు సందర్భంగా పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

నూకాంబిక ఉత్సవ విగ్రహాల బహూకరణ



పూజలు చేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీకాలనీ గ్రామదేవత శ్రీ నూకాంబి అమ్మవారి ఆలయానికి జెర్రిపోతుల శివ కుమారుడు మహేష్ అమ్మవారి ఉత్సవ విగ్రహాలను బహూకరించారు. ముందుగా ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించి అనంతరం గర్భగుడిలో విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే ఎన్‌పీఎస్ రద్దు

దాబాగార్డెన్స్ : నేషనల్ పెన్షన్ స్కీం (ఎన్‌పీఎస్) వల్ల కార్మికులకు ఎటువంటి లాభం లేకపోగా నష్టమేనని జేఎన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వికాస్ రావల్ అభిప్రాయపడ్డారు. పీపుల్ ఫర్ ఇండియా విశాఖపట్నం ఆధ్వర్యంలో ఆదివారం ఎల్ఐసీ ప్రాంగణంలో ఎన్‌పీఎస్ రద్దు-అందరికీ ఓపీఎస్ పేరిట సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 2004 వరకు ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీం అమలయ్యేదని, అది కూడా చాలా పోరాటాల ఫలితంగానే వచ్చిందన్నారు.

61వ వార్డులో బీఎల్‌ఏల ఇంటింటా సర్వే



సర్వేలో పాల్గొన్న బీఎల్‌ఏలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ఇండస్ట్రియల్ కాలనీ,జనతాకాలనీ తదితర ప్రాంతాల్లో ఆదివారం బీఎల్‌ఏలు ఇంటింటా ఓటరు సర్వే నిర్వహించారు. ఆదివారం బీఎల్‌ఏలు,వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జి.వి.ఎస్.ఎన్.రాజు (కేబుల్ వాసు) తదితరులు ఓటరు జాబితాలో ఉన్న వ్యక్తులు అదే అడ్రసులో ఉన్నారా లేదా అన్నదానిపై విచారించారు. జాబితాలో పేరు ఉండి,ఆ వ్యక్తి అక్కడ లేకుంటే ఎక్కడ ఉన్నారో తెలుసుకుని దానిపై అధికారులకు ఫిర్యాదు చేసే కార్యక్రమం చేపట్టారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం : విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం విశాఖ నుంచి, విశాఖ మీదుగా మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు.

సోమవారం నుంచి 12వ తేదీ వరకు గుంటూరు-రాయగడ (17243)ఎక్స్‌ప్రెస్, మంగళవారం నుంచి 13వ తేదీ వరకు రాయగడ-గుంటూరు (17244)ఎక్స్‌ప్రెస్, మంగళవారం నుంచి 12వ తేదీ వరకు మచిలీపట్నం-విశాఖ (17219) ఎక్స్‌ప్రెస్,13వ తేదీ తేదీ వరకు విశాఖ-మచిలీపట్నం (17220)ఎక్స్‌ప్రెస్, 12వ తేదీ తేదీ వరకు విజయవాడ- విశాఖ- విజయవాడ (12718/12717) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, 12వ తేదీ తేదీ వరకు కాకినాడ-విశాఖ- కాకినాడ (17267/17268) మెము స్పెషల్ రైళ్లు రద్దు చేశారు.

గమ్యం కుదించిన రైళ్లు

సోమ,మంగళవారాల్లో విశాఖలో బయల్దేరే విశాఖ-కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో బయల్దేరవలసిన కిరండూల్-విశాఖ(18513)ఎక్స్‌ప్రెస్ ఈ నెల 8, 9తేదీల్లో కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖ చేరుకుంటుంది. సోమ,మంగళవారాల్లో హౌరాలో బయల్దేరే హౌరా - జగదల్‌పూర్ (18005)సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ కొరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్‌లో బయల్దేరాల్సిన జగదల్‌పూర్ - హౌరా(18006) ఎక్స్‌ప్రెస్‌గా 7,8 తేదీలలో కోరాపుట్ నుంచి బయల్దేరి హౌరా చేరుకుంటుంది.

నాందేడ్ -విశాఖపట్నం రీషెడ్యూల్

ఆదివారం నాందేడ్‌లో సాయంత్రం 4.30గంటలకు బయల్దేరవలసిన నాందేడ్-విశాఖ(20812) సూపర్‌ఫాస్ట్ స్పెషల్ పెయిరింగ్‌రైలు రాక ఆలస్యంగా రాత్రి 8.30గంటలకు బయల్దేరింది.

వెల్‌కమ్ టు ఎన్‌ఏడీ



ఫ్లైఓవర్



అందమైన పూలమొక్కలు

- నగరానికి తలమానికంగా ఎన్‌ఏడీ ఫ్లైఓవర్
- ఆకట్టుకునేలా గ్రీనరీ

విశాఖ విద్య: ఎన్‌ఏడీ అంటే కొన్నాళ్ల వరకు వాహనదారులు వణికి పోయే వారు. ట్రాఫిక్‌లో చిక్కుకొని విలవిల్లాడేవారు. ఇప్పుడు ఆ కష్టాలు గట్టెక్కాయి. ఎంచక్కా ప్రయాణం సాగుతోంది. కోస్తా జిల్లాల నుంచి విశాఖ నగరానికి వచ్చే వారితో పాటు వాయుమార్గంలో వచ్చేవారికి ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ వెల్‌కమ్ చెబుతోంది. నగరానికి తలమానికంగా మారింది. విశాఖ నగరం నుంచి స్టీల్ ప్లాంట్, ఎయిర్‌పోర్ట్, విశాఖ డెయిరీ, ఆటోనగర్‌లో పరిశ్రమలకు వెళ్లి వచ్చే వారితో పాటు రాష్ట్ర , కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు ఎన్‌ఏడీ మీదగానే ప్రయాణం చేయాలి. దీంతో ఎన్‌ఏడీ సెంటర్ అనునిత్యం వాహనాలు, ప్రయాణికుల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యం గల ఎన్‌ఏడీ సెంటర్‌లో ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. రూ.150 కోట్లతో 2017లో ఫ్లై ఓవర్ నిర్మాణానికి టీడీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన చేశారు. అయితే ఏమాత్రం శ్రద్ధ తీసుకోలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు.

ఆకర్షణీయంగా పరిసరాలు

మరో వైపు ఫ్లైఓవర్ కింద ప్రాంతాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ప్రయాణికులు సేదతీరడానికి ఏర్పాట్లు చేశారు. పచ్చదనం కోసం మొక్కలు పెంచుతున్నారు.

ఎన్‌ఏడీకి ఆ పేరు ఎలా వచ్చిందంటే

ఎన్‌ఏడీ అంటే నేవల్ ఆర్మమెంట్ డిపో. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని ఈ డిపోలో నౌకలకు మందుగుండు సామగ్రి, టార్పెడోలు, క్షిపణులు, గనులు, బాంబులు, రాకెట్లు మరియు ఇతర పేలుడు వస్తువులు సేకరణ, నిల్వ వంటి కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అందుకే ఎన్‌ఏడీ సెంటర్ ప్రాచుర్యం పొందింది. ఇక్కడే నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎన్ఎస్టీఎల్) కూడా ఉంది.

ఎన్‌ఏడీ కూడలిలో సంజీవయ్య నగర్ వాసుల సౌజన్యంతో 2008లో అప్పటి కార్పొరేటర్, ప్రస్తుత డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆవిష్కరించారు. విస్తరణ నేపథ్యంలో ఇదే చోట 16 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. ఎన్‌ఏడీ ఫ్లైఓవర్‌తో సమాంతరంగా ఈ విగ్రహం ఉండడం విశేషం.



అంబేడ్కర్ సాక్షిగా ఎన్‌ఏడీ

సొగసు చూడతరమా

విశాఖ నగరానికి స్వాగత ద్వారంగా నిలిచే ఫ్లైఓవర్ డిజైన్ చూడముచ్చటగా ఉంటుంది. సినిమా సెట్టింగ్ మాదిరి కనిపిస్తోంది. నాలుగు దారుల్లో రాకపోకలు సాగించే పాదచారుల కోసం ఫ్లైఓవర్ మధ్యలో నడకదారి ఏర్పాటు చేశారు. ప్రమాదాలు జరుగకుండా ఫ్లైఓవర్ పైన ఇరువైపులా ఔట్ పోస్టులను సైతం ఏర్పాటు చేసి, 24 గంటల పాటు ట్రాఫిక్ పోలీసులు విధుల్లో ఉండేలా తగిన ఏర్పాట్లు చేశారు. దీంతో ఇక్కడ ప్రయాణం సాఫీగా సాగిపోతుంది.



ఫ్లైఓవర్ మధ్యలో నడక దారి

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందాం



దీక్షలో పాల్గొన్న నాయకులు

సీతమ్మధార : ప్రాణత్యాగాల ద్వారా సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందామని చిట్టివలస లేబర్ యూనియన్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న నిరాహారదీక్ష 946వ శిబిరానికి హాజరై ఆయన మాట్లాడారు. నగరంలోని అఖిలపక్ష కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా, మేధావులు అందరూ ఒక తాటిపైకి వచ్చి పోరాడుతున్నారన్నారు. లాభాల్లో నడుస్తున్న ప్లాంట్‌ను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తే ఉన్న ఉద్యోగాలు పోవడంతో పాటు ముందు తరాలకు ఉపాధి ఉండదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ అమ్మకానికి పెట్టి దేశాన్ని దివాళా తీయిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, నూలు ఆదినారాయణ, చిల్లరాం, వై.కొండయ్య, సూరప్పుడు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి పీఎస్‌ను సందర్శించిన సీపీ

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్‌ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదివారం సందర్శించారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాలను పరిశీలించారు. అధికారులు, సిబ్బంది పనితీరును సమీక్షించారు. రౌడీ షీటర్లపై పూర్తిగా నిఘా ఉంచాలని సూచించారు. మహిళలపై ఎలాంటి దాడులు జరగకుండా దిశ యాప్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణపై పలు సూచనలు చేశారు.

విశాఖ ఉక్కు కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలి



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. కార్మిక సంఘ నాయకులు, అఖిలపక్షాల నేతలను ప్రధాని వద్దకు తీసుకువెళ్లి స్టీల్ ప్లాంట్ విషయమై స్పష్టమైన ప్రకటన చేసేలా చొరవ తీసుకోవాలన్నారు. కూర్మన్నపాలెంలో ఉక్కు దీక్షలు ఆదివారం నాటికి 996వ రోజుకు చేరుకున్నాయి. ఉక్కు ఉద్యమం ప్రారంభించి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ చత్తీస్‌ఘడ్‌లో ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంలోని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుందని, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒత్తిడితోనే ఇది సాధ్యమైందన్నారు. ఏపీ సీఎం కూడా కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. సమావేశంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, కే.ఎస్.ఎన్.రావు, కారు రమణ, రామస్వామి, బొడ్డు పైడిరాజు, వరసాల శ్రీనివాస్, డి.అప్పారావు, డి.సురేష్‌బాబు, ఇతర నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికుల పోరాటానికి సంఘీభావం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆ సంస్థ కార్మికులు చేపట్టిన పోరాటానికి ఈనెల 8 నాటికి వెయ్యి రోజుల పూర్తవుతున్న సందర్భంగా గాజువాక కాంగ్రెస్ పార్టీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నిర్వహించిన సమావేశంలో నాయకులు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో నాయకులు గవర వెంకట రమణారావు, ఉరుకూటి అచ్చిబాబు, దొమ్మేటి రమణారావు, గుడివాడ శ్రీనివాసరావు, షేక్ అస్మత్ అలీ, దానబోయిన అప్పలనాయుడు, కోవిరి దేముడు, కొవిరి కోదండరావు, చట్టి సింహాచలం, పల్లేల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.